సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

మంగళవారం । 22 । ఏప్రిల్ । 2025



విద్యుత్ పునరుద్ధరణ.. ఇక క్షణాల్లోనే..
విద్యుత్ లైన్లలో సాంకేతిక సమస్యలు పరిష్కరించేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ పోల్ మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టింది. - 8లో▸



రాష్ట్రంలో రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి - 8లో▸
కాంగ్రెస్ విధానాలతో రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి దాపురించిందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు.



గరిష్టం/కనిష్టం
$39^0/25^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి వేడి ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. రాత్రి సమయంలో ఉక్కపోత ఉంటుంది.

న్యూస్‌రీల్

న్యాయమూర్తికి వీడ్కోలు సన్మానం



వరంగల్ లీగల్ : హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ రమేష్‌బాబు బదిలీపై వెళ్తున్న సందర్భంగా సోమవారం వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబతోపాటు న్యాయమూర్తులు, రెండు జిల్లాల బార్ అసోసియేషన్ల బాధ్యులు జడ్జి రమేష్‌బాబు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ల అధ్యక్షులు వలుస సుధీర్, పులి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శులు రమాకాంత్, కొత్త రవి, బార్ కౌన్సిల్ మెంబర్ జయపాల్, న్యాయవాదులు పాల్గొన్నారు.

పోలీస్ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తాం



వరంగల్ క్రైం : జాతీయస్థాయి క్రీడల్లో రాణించే పోలీస్ క్రీడాకారులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. గత నెలలో మధ్యప్రదేశ్ ఇండోర్‌లో జరిగిన 18వ జాతీయ పోలీస్ షూటింగ్ (స్పోర్ట్స్) చాంపియన్ షిప్‌లో తెలంగాణ పోలీస్ తరఫున ప్రాతినిధ్యం వహించి 300 మీటర్ల మహిళా జట్టు విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన సుబేదారి ఏఎస్సై సువర్ణను సోమవారం కమిషనరేట్ కార్యాలయంలో సీపీ ఘనంగా సత్కరించారు. పరిపాలన విభాగం అదనపు డీసీపీ రవి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ హనుమకొండ ఎస్ఈతో 'ఫోన్ ఇన్'

హన్మకొండ: విద్యుత్ సరఫరా, నూతన సర్వీస్ మంజూరుపై ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.మధుసూదన్‌రావు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఫోన్ ఇన్ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు 94910 75110 నంబర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు అందించాలని, సమస్యలు తెలపాలని కోరారు.

కొనసాగుతున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. మొత్తం 34 కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన టెన్త్ పరీక్షలకు 2,041 మంది విద్యార్థులకుగాను 1775మంది హాజరయ్యారు. 266మంది గైర్హాజరయ్యారు. ఇంటర్‌లో 4,238మందికి 3,802మంది హాజరుకాగా, 436మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ ఆనగోని సదానందం తెలిపారు. రాష్ట్ర పరిశీలకులు అనురాధ, కె.విజయ్‌కుమార్ సోమవారం హనుమకొండ జిల్లాలోని పరకాల ప్రభుత్వ పాఠశాల, జెడ్పీ బాలుర పాఠశాల, ఎస్ఆర్ స్కూల్ కేంద్రాలను తనిఖీచేశారు. మరో ముగ్గురు రాష్ట్ర పరిశీలకులు ఎ.శ్రీనివాస్, దామోదర్‌రెడ్డి, ఎ.విజయమోహన్ ములుగు జిల్లాలోని పరీక్ష కేంద్రాలను సందర్శించారు.

గణితంతోనే అన్ని విభాగాల్లో పరిశోధనలు



కాజీపేట అర్బన్ : గణితశాస్త్రం అన్ని విభాగాలతో ముడిపడి ఉంటుందని, వివిధ విభాగాల్లో నూతన పరిశోధనలు, ఆవిష్కరణలు గణితంతోనే సాధ్యమని నిట్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఎన్వీ.ఉమామహేశ్ తెలిపారు. నిట్ వరంగల్‌లోని హోమీబాబా హాల్‌లో సోమవారం మ్యాథమెటికల్ డిపార్ట్‌మెంట్, ఐఐటీ బాంబే నేషనల్ సెంటర్ ఫర్ మేథమెటిక్స్, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ ముంబయి సౌజన్యంతో వారం రోజుల టీచర్స్ ఎన్‌రిచ్‌మెంట్ వర్క్‌షాప్‌ను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. న్యూ ఎడ్యుకేషన్ పాలసీ-2020కి అనుగుణంగా ఉపాధ్యాయులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ఇందుకు ఈ వారం రోజుల వర్క్‌షాప్ వేదికగా నిలవాలన్నారు. కార్యక్రమంలో నిట్ మ్యాథమెటిక్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ సెల్వరాజ్, ప్రొఫెసర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

హనుమకొండ నయీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న విద్యార్థికి సెకండియర్‌లో స్నేహితులతో గంజాయి అలవాటైంది. ఫైనలియర్ వచ్చేసరికి వ్యసనంగా మారింది. తండ్రి కళాశాల ఫీజు కింద ఇచ్చిన రూ.20వేలు గంజాయికి ఖర్చుపెట్టాడు. ఆ తరువాత ప్రైవేట్ లోన్‌యాప్ ద్వారా మరో రూ.30వేలు తీసుకున్నాడు. ఆ తరువాత కళాశాల, పరీక్షల ఫీజు కోసం ఇచ్చిన మరో రూ.20 వేలు గంజాయి కోసం ఖర్చు చేశాడు. చివరకు పరీక్ష ఫీజు కట్టలేదు. పరీక్షలు రాయలేదు. ఆ విద్యార్థి ఇటీవల పోలీసులకు చిక్కగా విషయం బయటపడడంతో తండ్రి బోరున విలపించాడు. కానీ, ఆ విద్యార్థి గంజాయి మత్తునుంచి ఇంకా బయటకు రాలేదు.

హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో వడ్ల వ్యాపారం చేసే ఓ తండ్రికి చదువు రాదు. అతడి కుమారుడు ఇంటర్‌తో చదువు ఆపేశాడు. గంజాయి అలవాటైంది. తండ్రి వ్యాపారానికి సంబంధించి ఫోన్ పే, గూగుల్ పేను ఆ కొడుకు నిర్వహిస్తాడు. గంజాయికి డబ్బులు అవసరమైనప్పుడల్లా తండ్రికి తెలియకుండా కుమారుడు డబ్బులు వాడేశాడు. ఇలా వేయి, రెండు వేలు కాదు.. రూ.2.50 లక్షలు కాజేశాడు. ఈ క్రమంలో ఇటీవల పోలీసుల దాడిలో సదరు యువకుడు గంజాయి తాగుతూ దొరికాడు. గంజాయికి డబ్బులు ఎలా వస్తున్నాయని పోలీసులు కౌన్సెలింగ్ చేస్తే విషయం బయటపడింది. అసలు విషయం తెలిశాక కొడుకును ఏం అనాలో ఆ తండ్రికి అర్థంకాని పరిస్థితి.

మత్తుకు అప్పు..



- ఇంట్లోవాళ్ల కళ్లు గప్పి డబ్బులు వాడేస్తున్న విద్యార్థులు
- పోలీసుల విచారణలో తెలిశాక కంగుతింటున్న తల్లిదండ్రులు
- ఆరెపల్లి రింగ్ రోడ్డు అడ్డాగా గంజాయి సరఫరా
- ద్విచక్ర వాహనాలతో స్టూడెంట్స్ అంటూ బురిడీ

గంజాయి కొనుగోలుకు లోన్‌యాప్‌లో యువత రుణాలు

రుణ ఉచ్చులో యువత

డిగ్రీ, ఇంజనీరింగ్ చదివే విద్యార్థులు గంజాయి తాగటానికి డబ్బులు లేకపోవడంతో ప్రైవేట్ లోన్‌యాప్ ఉచ్చులో చిక్కుతున్నారు. ఎం ప్యాకెట్, బడ్డీబ్రో, క్రెడిట్ బీ, క్యాష్‌బీన్ వంటి లోన్ యాప్‌లు యువతను ఆకర్షిస్తున్నాయి. డిగ్రీ ఐడీ కార్డును అప్‌లోడ్ చేస్తే రూ.20 వేల నుంచి రూ.30వేలు ఇస్తున్నారు. ప్రైవేట్ ఉద్యోగులు అయితే రూ.20 వేల నుంచి రూ.50 వేలు ఇస్తున్నారు. దీంతో చేతికి డబ్బులు అందడంతో గంజాయిని కొనుగోలు చేసి తాగుతున్నారు.

వరంగల్ క్రైం:

పెళ్లి బరాత్ అంటేనే యువతలో జోష్ నిండుకుంటుంది. తల్లిదండ్రులకు తెలియకుండా స్నేహితులతో ఓ బీర్. ఇది చాలా పెళ్లిళ్ల సమయంలో కనిపించే సీన్. కానీ రోజులు మారుతున్నాయి. బరాత్ తీరు మారుతోంది. పార్టీకి సంబంధించి స్నేహితులు రహస్యంగా మాట్లాడుకుంటున్నారు. ఏకాంతంగా జరుపుకుంటున్నారు. తల్లిదండ్రులతోపాటు అందరి కళ్లు కప్పి మత్తులో తూగుతున్నారు. అదీ గంజాయి మత్తులో. మరి వీరికి డబ్బులు ఎలా వస్తున్నాయని ఆరా తీస్తే కళ్లు చెదిరే నిజాలు తెలుస్తున్నాయి. కాలేజీ ఫీజుల పేరుతో ఇంట్లో వారి కళ్లు గప్పి డబ్బులు వాడేసుకుంటున్నవారు కొందరైతే.. ఏకంగా లోన్‌యాప్‌లలో రుణాలు తీసుకుంటున్న వారు మరికొందరు ఉన్నారు. ఇటీవల హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌ పరిధి ఓ గ్రామంలోని ఓ గదిలో రహస్యంగా గంజాయి సేవిస్తున్న ఐదుగురు యువకులను నార్కోటిక్స్ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు చేసే వరకు వారు గంజాయి సేవించినట్లు గ్రామంలో ఎవరికి తెలియదు. ఆ ఐదుగురిలో ఓ మైనర్ ఉండడం గమనార్హం. వీరికి పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహిస్తే అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి.

ఆరెపల్లి రింగ్‌రోడ్డు అడ్డాగా..

ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలనుంచి విచ్చలవిడిగా వస్తున్న గంజాయి ఆరెపల్లి రింగ్ రోడ్డు నుంచి ట్రైసిటీలోని వివిధ ప్రాంతాలకు సరఫరా అవుతున్నట్లు సమాచారం. ప్రధానంగా ద్విచక్ర వాహనాలపై గంజాయిని ఆరెపల్లి కెనాల్ మీదుగా పోచమ్మ మైదాన్, ఓఆర్ఆర్ మీదుగా ఎర్రగట్టుగుట్ట, యాదవనగర్ మీదుగా హనుమకొండ చౌరస్తా, ఇతర ప్రాంతాలకు సరఫరా అవుతున్నట్లు సమాచారం. ఈ తంతు కొన్నేళ్లుగా సాగుతున్నా పోలీసులు పట్టుకోలేకపోతున్నారు. స్కూటీల్లో టిఫిన్ బాక్సులను పెట్టుకుని తరలిస్తున్నారు. విద్యార్థుల మాదిరిగా స్కూటీ వాహనాలు నడుపుతూ.. బ్యాగులు ధరించి ఉండడం వల్ల పోలీస్ అధికారులు స్టూడెంట్స్ అని వదిలిపెడుతున్నారు. కానీ.. కొంత మంది విద్యార్థులే గంజాయి సరఫరా చేస్తున్నట్లు ఇటీవల పోలీసులు గుర్తించారు. ఇంజనీరింగ్, కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని గంజాయి అమ్మకాలను సాగిస్తున్నట్లు తెలిసింది. గంజాయి అలవాటు ఉన్నవారే డబ్బుల కోసం చిన్న చిన్న మొత్తంలో గంజాయిని పక్క రాష్ట్రాలనుంచి తీసుకొచ్చి ఇక్కడ అమ్ముతున్నట్లు తెలిసింది.

ఈ నెలలో పట్టుబడిన కేసులు

హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 14న గంజాయి, హాష్ ఆయిల్‌తో పట్టుబడిన కోటగిరి సాయి వినయ్, లావుడ్య రవీందర్, గుగులోత్ హరిసింగ్‌ను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.5లక్షల విలువైన గంజాయి, రూ. 2.50 లక్షల విలువైన హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఈనెల 17న పరకాల పోలీసులు రూ. 3 లక్షల విలువైన 6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఒడిషాకు చెందిన నిందితులను అరెస్టు చేశారు.

ఈనెల 11న హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని డబ్బాల వద్ద ముగ్గురు యువకులను అరెస్ట్ చేసి వారినుంచి ఒక కిలో 730 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

ఈనెల 8న హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అమ్ముతున్న ఇద్దరు యువకులతోపాటు ఓ మైనర్ బాలుడిని, మరో నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు.

ఈనెల 3న హనుమకొండ బస్టాండ్ దగ్గర ఆటోలో గంజాయితో ఉన్న గుజరాత్‌కు చెందిన గౌతమ్ భరత్‌సిండేను తనిఖీ చేయగా అతడి దగ్గర 16 కిలోల ఎండు గంజాయి లభించింది.

కలెక్టరేట్ ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు వీరయ్య



కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న పాలకులు

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్.వీరయ్య



కలెక్టరేట్ ఎదుట వేసిన గుడిసె నమూనా..

హన్మకొండ: పేదలను విస్మరిస్తూ కార్పొరేట్ శక్తులకు పాలకులు సంపదను దోచిపెడుతున్నారని సీపీఎం సెంట్రల్ కమిటీ సభ్యుడు ఎస్.వీరయ్య ధ్వజమెత్తారు. గత 20 రోజులుగా హనుమకొండ జిల్లాలో స్థానిక సమస్యలపై సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో గుర్తించిన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అంతకుముందు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియం నుంచి కలెక్టరేట్ వరకు మహా ప్రదర్శన నిర్వహించారు. వాహనంపై గుడిసె నమూనా వేసి కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. నిరసన కార్యక్రమంలో ఎస్.వీరయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో ఇళ్లు లేని నిరుపేదలు ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని ఏళ్ల తరబడి జీవనం కొనసాగిస్తున్నా పట్టాలు ఇవ్వలేదన్నారు. దీంతో ప్రభుత్వం ఇస్తున్న ఇందిరమ్మ ఇళ్లకు అనర్హులవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పేరుతో కాలం వెళ్లబుచ్చింది తప్ప సమస్యలు పరిష్కరించలేదని దుయ్యబట్టారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిని కలిసి సమస్యలతో కూడిన పత్రాలు అందించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు చుక్కయ్య, బొట్ల చక్రపాణి, రాగుల రమేష్, గొడుగు వెంకట్, వాంకుడోతు వీరన్న, రాములు, తిరుపతి, లింగయ్య, భానునాయక్, నాయకులు పాల్గొన్నారు.

మే 2న 'ఇందిరమ్మ' అర్హుల జాబితా

- 30వ తేదీ వరకు వెరిఫికేషన్ పూర్తి చేయాలి
- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రావీణ్య

హన్మకొండ: ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపికకు ఈనెల 22 నుంచి 30వ తేదీ వరకు అధికారులు వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తిచేసి మే 2న అర్హుల జాబితా ప్రదర్శించాలని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అర్హుల ఎంపిక కోసం నియమితులైన మండల స్థాయి వెరిఫికేషన్ ఆఫీసర్లకు సోమవారం కలెక్టరేట్‌లో శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ప్రతీ మండలంలో నలుగురు అధికారులను వెరిఫికేషన్ ఆఫీసర్లుగా నియమించినట్లు తెలిపారు. మహిళలను మాత్రమే అర్హులుగా ఎంపిక చేయాలని సూచించారు. వారి వివరాలను నమోదు చేయాలన్నారు. ఏమైనా సందేహాలుంటే ఎంపీడీఓ, హౌసింగ్ పీడీలను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వెరిఫికేషన్ అధికారులకు పంచాయతీ కార్యదర్శుల సహకారం అందిస్తున్నట్లుగానే అర్బన్ ప్రాంతంలో వార్డు ఆఫీసర్లు తోడ్పాటు అందించాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి రవీందర్, కాజీపేట మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ గొడిశాల రవీందర్, పరకాల ఆర్డీఓ నారాయణ, గృహ నిర్మాణ సంస్థ డీఈ సిద్ధార్థనాయక్, ఎంపీడీఓలు, డిప్యూటీ తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలి..
జిల్లాలోని ప్రతీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో సరిపడా గన్నీ బ్యాగులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లో సంబంధిత జిల్లా అధికారులతో జిల్లాలో ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అకాల వర్షాలు పడే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల్లో తగినన్ని టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, వివిధ విభాగాల ఉన్నతాధికారులు మేన శ్రీను, రవీందర్ సింగ్, సంజీవరెడ్డి, కొమరయ్య, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

డీ సిల్టేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి

నగర మేయర్ గుండు సుధారాణి



మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్: గ్రేటర్ పరిధి నాలాల్లో డీ సిల్టేషన్ ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడేతో కలిసి శానిటేషన్ సంబంధ అంశాలపై సమీక్షించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఇప్పటినుంచే ముందస్తు చర్యలు చేపట్టడానికి శానిటేషన్ అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు టాస్క్‌టీంలను తయారు చేసుకొని వార్డుల వారీగా యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలన్నారు. సమావేశంలో సీఎంహెచ్‌ఓ రాజారెడ్డి, ఎంహెచ్‌ఓ రాజేష్, ఈఈ మహేందర్, శానిటరీ సూపర్‌వైజర్లు భాస్కర్, నరేందర్, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు మధుకర్, బలభద్ర, రవి, కన్సల్టెంట్ ప్రతినిధులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సిబ్బందికి టోపీలు...
జీడబ్ల్యూఎంసీలో పారిశుద్ధ్య సిబ్బందిగా విధులు నిర్వహిస్తున్న పలువురికి సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ డా. అశ్విని తానాజీవాకడేలు సంయుక్తంగా టోపీలు అందజేశారు.

ఎల్ఆర్ఎస్‌పై అవగాహన కల్పించండి
ఎల్ఆర్ఎస్ 25శాతం రిబేట్‌తో ఈనెల 30వరకు చివరి గడువు ముగుస్తున్నందున నగర వాసులకు అవగాహన కల్పించాలని మేయర్ సుధారాణి అన్నారు. కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ఎల్ఆర్ఎస్ పురోగతిపై అధికారులతో సమీక్షించారు. బల్దియా పరిధిలో లక్షకు పైగా ప్లాట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు రాగా, అందులో అర్హత గల 72,197 మందికి ఫీజు చెల్లించాలని ప్రొసీడింగ్‌లు జారీ చేసినట్లు మేయర్ తెలిపారు. అందులో ఇప్పటివరకు 24,670 మంది ఫీజులు చెల్లించగా 3వేలమందికి క్రమబద్ధీకరణ ప్రొసీడింగ్‌లు అందజేశామని తెలిపారు. సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

చెత్త నియంత్రణపై సమీక్ష


కాజీపేట మండలం రాంపూర్ డంప్ యార్డులో చెత్తను నియంత్రించడానికి చేపట్టాల్సిన చర్యలపై బల్దియా కార్యాలయంలో సోమవారం సమీక్షించారు. రాంపూర్ డంపింగ్‌యార్డులో చెత్త నిల్వలు పేరుకుపోవడం, పొగతో సమీప కాలనీలు పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి'లో ఈ నెల 19న 'వదలని చెత్త' శీర్షికన ప్రచురితమైన కథనానికి బల్దియా అధికారులు స్పందించారు. విభాషా సొల్యూషన్ ప్రతినిధులు చెత్త నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలను మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడేలకు వివరించారు. ఈసందర్భంగా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ వేసవి కాలంలో డంప్ యార్డ్‌లో చెత్తనుంచి వచ్చే పొగ నియంత్రణకు నీటిని చల్లడంతోపాటు ప్రస్తుతం నిల్వ ఉన్న చెత్తను రోజువారీ చెత్తతో కలపకుండా వేరుగా ఉంచాలని తెలిపారు. నిత్యం వచ్చే తడి, పొడిత్తలో పొడిచెత్త వాటా 30-40శాతం వరకు ఉంటుందని, దీనిని సిమెంట్ ఫ్యాక్టరీలకు తరలించాల్సి ఉంటుందన్నారు. దీనివల్ల రోజువారీ చెత్తను గణనీయంగా తగ్గించవచ్చునని, తడిచెత్తను ఎరువుగా మార్చవచ్చని వారు వివరించారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

యూనిఫాంలు నాణ్యతగా ఉండాలి : కలెక్టర్ సత్యశారద

వరంగల్: ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థులకు జూన్ మొదటి వారంలోగా నాణ్యతగా ఉన్న యూనిఫాంలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని వరంల్ కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓ విజయలక్ష్మీతో కలిసి డీఆర్డీఓ కౌసల్యాదేవి, డీఈఓ జ్ఞానేశ్వర్, జిల్లా సంక్షేమ శాఖల అధికారులు, ఎంఈఓలు, ఏపీఎంలు, జిల్లా సమాఖ్య, మెప్మా సభ్యులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూనిఫాంల తయారీ ప్రక్రియ వేగవంతం చేసి మే 20లోగా సిద్ధం చేసేలా సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఎం రేణుక పాల్గొన్నారు.

వచ్చే నెలలో టీచర్లకు ట్రైనింగ్

- రిసోర్స్ పర్సన్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం
- డీఈఓ కార్యాలయాల్లో స్వీకరణ
- నేటినుంచి ఈనెల 24వరకు గడువు
- ఇంటర్వ్యూ, డెమో ద్వారా ఎంపికలు



విద్యారణ్యపురి: రాష్ట్రంలో ఉపాధ్యాయులకు వేసవిలో శిక్షణలు ఇవ్వనున్నారు. తొలుత ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులను మండల, జిల్లాస్థాయిలో రిసోర్స్ పర్సన్‌లుగా నియమించనున్నారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు ప్రకారం ఉమ్మడి జిల్లా పరిధి హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పనిచేస్తున్న మండల, జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల, మోడల్‌స్కూల్స్, రెసిడెన్షియల్ పాఠశాలల నుంచి ఆసక్తి కలిగిన ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్లు, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు, గెజిటెడ్ హెడ్మాస్టర్లను రిసోర్స్‌పర్సన్‌లుగా ఎంపిక చేయనున్నారు. ఇందుకోసం ఆయా జిల్లాల డీఈఓలు.. సదరు ఉపాధ్యాయులనుంచి ఈనెల 22నుంచి 24వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ప్రతీ జిల్లాలో ప్రాథమిక పాఠశాలలనుంచి మండలస్థాయిలో రిసోర్స్ పర్సన్‌లుగా తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్, ఈవీఎస్ సబ్జెక్టులనుంచి ఇద్దరు చొప్పున ఎంఆర్‌పీల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. జిల్లాస్థాయికి డీఆర్‌పీలుగా కూడా ఆయా సబ్జెక్టులకు ఒక్కో సబ్జెక్టుకు ఇద్దరు చొప్పున ఎంపిక చేసేందుకు దరఖాస్తులు తీసుకుంటారు. ఉర్దూ మీడియం, స్పెషల్ ఎడ్యుకేషన్‌నుంచి కూడా రిసోర్స్ పర్సన్‌లను నియమిస్తారు.

జిల్లాస్థాయిలో హైస్కూళ్లనుంచి..
ప్రతీ జిల్లానుంచి హైస్కూల్‌స్థాయిలో విద్యాబోధన చేస్తున్న టీచర్లు ప్రతీ సబ్జెక్టునుంచి నలుగురి చొప్పున 9 సబ్జెక్టులకు 36మందిని జిల్లాస్థాయి రిసోర్స్‌పర్సన్‌లుగా ఎంపిక చేస్తారు. ఉర్దూ మీడియంలో ఐదు సబ్జెక్టులకు ఇద్దరు చొప్పున పది మందిని నియమిస్తారు. దరఖాస్తులు తీసుకున్నాక అందులోనుంచి అవసరం మేరకు సంబంధిత అధికారులు ఎంపిక చేస్తారు.

కలెక్టర్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు
ప్రతీ జిల్లాలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించాక ఏ జిల్లాకు ఆ జిల్లాలో కలెక్టర్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. డెమో ద్వారా ఎంపిక చేస్తారు. ఎంపిక చేసిన జాబితాలను ఆయా జిల్లాల డీఈఓలు ఈనెల 28వ తేదీ వరకు రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణామండలికి, ఎస్ఈఆర్‌టీ అధికారులకు పంపనున్నారు. ఇదిలా ఉండగా హనుమకొండ జిల్లాలో ఆసక్తిగల తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియం ఉపాధ్యాయులు నిర్దేశించిన దరఖాస్తుల ఫారం ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని డీఈఓ డి.వాసంతి సోమవారం కోరారు. ఇతర సమాచారం కోసం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఎంపిక చేసిన రిసోర్స్ పర్సన్లకు శిక్షణ
ఎంపికైన మండల, జిల్లాస్థాయి రిసోర్స్ పర్సన్లకు ఆయా సబ్జెక్టుల వారీగా కూడా రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణామండలి అధికారులు త్వరలోనే సబ్జెక్టు ఎక్స్‌పర్ట్స్‌తో శిక్షణ ఇవ్వనున్నారు. వీరి ద్వారా జిల్లాస్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణలు ఉంటాయని సమాచారం. గుణాత్మక విద్యను అమలుచేసేందుకు ఉపాధ్యాయులకు అందించే శిక్షణలకు ఈ రిసోర్స్‌పర్సన్‌లను వినియోగిస్తారు.

ప్రత్యేక చొరవ చూపండి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్: ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే కోరారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో కమిషనర్ హాజరై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పరిష్కారం కోసం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. మొత్తం 128 దరఖాస్తులు వచ్చినట్లు సంబంధిత విభాగం అధికారులు తెలిపారు. ఇందులో ఎక్కువగా టౌన్‌ప్లానింగ్‌కు 55, ఇంజనీరింగ్ - 37, ప్రాపర్టీ టాక్స్(రెవెన్యూ) - 14, మంచినీటి సరఫరా-12, హెల్త్, శానిటేషన్ - 09, హార్టికల్చర్ - 01కు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్‌ఓ డా.రాజారెడ్డి, డీఎఫ్‌ఓ శంకర్‌లింగం, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, హెచ్‌ఓలు రమేష్, లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్‌లు పాల్గొన్నారు.

ఐరన్, ఫోలిక్ మాత్రలతో ఎనీమియా నివారణ

హనుమకొండ డీఎంహెచ్‌ఓ అప్పయ్య



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య

ఎంజీఎం : ఆరు నెలల వయస్సు పిల్లలనుంచి 49 సంవత్సరాల వయస్సు ఉన్న మహిళలందరికీ ఐరన్, ఫోలిక్ మాత్రలు పంపిణీ చేయడం ద్వారా ఎనీమియాను నివారించవచ్చని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ అప్పయ్య.. ఫార్మసిస్టులకు సూచించారు. కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఎనీమియా ముక్త భారత కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఫార్మసిస్టులకు సోమవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ అప్పయ్య మాట్లాడుతూ జిల్లాను ఎనీమియా రహితంగా మార్చేందుకు ప్రతీ ఆరోగ్య కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌ఓ మదన్‌మోహన్‌రావు, జిల్లా ఎమినేషన్ అధికారి మహేందర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయ్‌కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ మంజుల, హెచ్ఈఈఓ చంద్రశేఖర్, డీడీఎం ప్రవీణ్, ఎంపీహెచ్‌ఓ రాజేశ్వర్‌రెడ్డి, ఫార్మసిస్టులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్ తప్పనిసరి
హజ్ యాత్రకు వెళ్లే ప్రతి యాత్రికుడు తప్పకుండా వాక్సినేషన్ చేయించుకొని సర్టిఫికెట్ పొందాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య సూచించారు. సోమవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో హజ్ యాత్రికుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మొత్తం 53 మందికి గాను 47 మందికి వ్యాక్సిన్ ఇచ్చినట్లు తెలిపారు.

యథావిధిగా పీజీ కోర్సుల నాలుగో సెమిస్టర్ పరీక్షలు

వాయిదా వేయాలని రిజిస్ట్రార్‌కు వినతి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలా బాద్ జిల్లాలో ఈనెల 26వ తేదీ నుంచి పీజీ కోర్సుల నాలుగో సెమిస్టర్ పరీక్షలు యథావిధిగా నిర్వహించనున్నామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్ సోమవారం తెలిపారు. కొద్దిరోజులుగా కొందరు పీజీ కోర్సుల విద్యార్థులు ఆయా నాలుగో సెమిస్టర్ల పరీక్షలు వాయిదావేయాలని అధికారులను కోరుతూ వస్తున్నారు. సోమవారం కూడా రిజిస్ట్రార్ రామచంద్రంను కలిసి విన్నవించారని సమాచారం. ఆ తర్వాత పీజీ కోర్సుల పరీక్షలు వాయిదావేశారనే అంశం యూనివర్సిటీలో ప్రచారం జరుగుతోంది. విద్యార్థుల పోరాట ఫలితంగా పరీక్షలు వాయిదావేశారని సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్‌ను 'సాక్షి' వివరణ కోరగా ఈనెల 26వ తేదీ నుంచి జరిగే పరీక్షలను సోమవారం వాయిదా వేయలేదన్నారు. అయితే విద్యార్థులు వాయిదావేయాలని కోరుతున్నారన్నారు. ఈవిషయంపై మంగళవారం యూనివర్సిటీ కాలేజీల ప్రిన్సిపాళ్లు, హాస్టళ్ల డైరెక్టర్, పరీక్షల విభాగం అధికారులతో సమావేశం నిర్వహించి చర్చించి పీజీకోర్సుల నాలుగో సెమిస్టర్ల పరీక్షలు నిర్వహించాలా.. వాయిదా వేయాలా అనే అంశం నిర్ణయిస్తామని రాజేందర్ తెలిపారు.

కాజీపేట లోకోపైలెట్ డిపోపై మరో పిడుగు..

- నాలుగు క్రూ లింక్‌ల తరలింపునకు సిద్ధం
- ఆందోళనలో లోకోపైలెట్లు

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే లైకోపైలెట్‌పై మరో పిడుగు పడింది.కాజీపేట క్రూ కేంద్రంగా పని చేస్తున్న కోచింగ్ క్రూ లింక్‌లలో కొన్ని లింకులు కృష్ణా, ఎల్‌టీటీ, కోణార్క్, గౌతమి ఎక్స్‌ప్రెస్‌లను విజయవాడ గాల డిపోనకు తరలిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు రైల్వే లోకోపైలెట్లు సోమవారం రాత్రి తెలిపారు. మంగళవారం నుంచి అధికారికంగా ఈ ఎక్స్‌ప్రెస్ లింక్‌లను విజయవాడ నుంచి ఆపరేట్ చేస్తున్నట్లు, ఇందుకు సంబంధించిన చార్ట్ తయారు చేశారని వారు తెలిపారు. గతంలో ఈ లింక్‌లను కాజీపేట డిపో వారే అప్ అండ్ డౌన్ రూట్‌లో నడిపేవారని పేర్కొన్నారు. 2022లో సికింద్రాబాద్ రైల్వే అధికారులు రెండు ట్రేడ్‌యూనియన్ల నాయకులతో చర్చించి కాజీపేటకు కేటాయించిన ఈ లింక్‌లను భవిష్యత్‌లో కాజీపేటలో ఉంటాయని హామీ ఇచ్చారు. అయితే ఇప్పుడు ఈ నాలుగు క్రూలింక్‌లను మార్చడం కాజీపేట డిపోనకు గుదిబండగా మారిందని లైకోపైలెట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం కాజీపేట నుంచి 185 పోస్టులను ఇతర క్రూ డిపోలకు తరలించగా ఇప్పుడు లింక్‌ల తరలింపు నిర్ణయం ఆందోళనకు గురిచేస్తుందని లోకోపైలట్లు, రైల్వే నాయకులు వాపోతున్నారు. కాజీపేట లోకోపైలెట్ డిపో నుంచి పోస్టులు, లింక్‌ల తరలింపు జరగకుండా మరోసారి ప్రజాప్రతినిధులు, రైల్వే నాయకులు ఉద్యమించాల్సిన అవసరం ఉందని లోకోపైలెట్లు కోరుతున్నారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే సికింద్రాబాద్ రైల్వే అధికారులతో మాట్లాడి న్యాయం చేయాలని లోకోపైలెట్లు వేడుకుంటున్నారు.

చెల్లని చెక్కు ఇచ్చిన వ్యక్తికి ఏడాది జైలు

జనగామ రూరల్: చెల్లని చెక్కు ఇచ్చిన జనగామ జిల్లా తరిగొప్పుల మండలం బొంత గట్టు నాగారం మాజీ సర్పంచ్ ఇరుమళ్ల రాజయ్యకు ఏడాది జైలు శిక్షతోపాటు రూ. 7 లక్షల జరిమానా విధిస్తూ జనగామ జిల్లా ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జి. శశి సోమవారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా నర్మెట గ్రామానికి చెందిన గంగుల శ్రీనివాస్ రెడ్డికి మాజీ సర్పంచ్ ఇరుమళ్ల రాజయ్య రూ.6 లక్షల 66 వేల అప్పు ఇవ్వాల్సి ఉంది. ఈ క్రమంలో 2016 ఆగస్టు 9వ తేదీన రాజయ్య తన అప్పును నగదుకు బదులు చెక్కు రూపేణ ఇచ్చాడు. ఈ చెక్కు చెల్లక పోవడంతో శ్రీనివాస్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన మేజిస్ట్రేట్.. రాజయ్యకు ఏడాది జైలు శిక్షతోపాటు రూ. 7 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు బాధితుడి తరఫున న్యాయవాది ఎలగందుల చంద్రరుషి తెలిపారు.

విద్యుత్ పునరుద్ధరణ.. ఇక క్షణాల్లోనే..

కరెంట్ అంతరాయాలు సులువుగా గుర్తించొచ్చు

- ప్రతీ స్తంభానికి నంబర్.. డిజిటలైజేషన్
- విద్యుత్ లైన్‌లో సమస్య ఉత్పన్నమైతే వెంటనే చేరుకునే అవకాశం..
- ఆపై వెంటనే పునరుద్ధరణ
- నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా టీజీ ఎన్పీడీసీఎల్ అడుగులు



హన్మకొండ: విద్యుత్ లైన్లలో సాంకేతిక సమస్యలు తలెత్తినా? అంతరాయం కలిగినా? వెంటనే.. వేగంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా సమస్యను త్వరితగతిన గుర్తించేందుకు పోల్ మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టింది. ఈ క్రమంలో ప్రతీ స్తంభానికి నంబర్ కేటాయిస్తోంది. దీని ద్వారా ప్రతీ స్తంభానికి లెక్క ఉండడంతోపాటు ఎక్కడ సమస్య ఉత్పన్నమైందో పోల్ నంబరింగ్ ద్వారా సులువుగా తెలుసుకోవచ్చు. నంబర్ వేసిన ప్రతీ స్తంభాన్ని డిజిటలైజేషన్ చేస్తుండడంతో ఏ ప్రాంతంలో.. ఏ స్తంభం పరిధిలో సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైనవో సులువుగా గుర్తించొచ్చని విద్యుత్ అధికారులు తెలిపారు. పోల్ నంబరింగ్, డిజిటలైజేషన్ ద్వారా సాంకేతిక సమస్యలను క్షణాల్లో గుర్తించి, వాటిని అధిగమించి వేగంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరించొచ్చు. అయితే పోల్ నంబరింగ్ పనులు వేగంగా జరుగుతున్నా, డిజిటలైజేషన్ ప్రక్రియ అంత త్వరగా జరగడం లేదు. పొలాల్లో పంటలు ఉండడంతో వ్యవసాయ ఫీడర్లలో నంబరింగ్ ప్రక్రియ పూర్తి కాలేదు. పంటలు కోతకు రావడంతో నంబరింగ్ ప్రక్రియ పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. వానాకాలం పంటలు సాగు చేసేలోపు ముందు నంబరింగ్ ప్రక్రియ పూర్తి చేసి, ఆ వెనువెంటనే డిజిటలైజేషన్ పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. స్తంభాలకు రెండు రకాల రంగులతో నంబరింగ్ చేస్తున్నారు. 33 కేవీ ఫీడర్లలో స్తంభంపై పసుపు రంగు వేసి ఆ రంగుపై ఎర్రని రంగుతో నంబర్ వేస్తున్నారు. 11 కేవీ ఫీడర్లలో స్తంభానికి పసుపు రంగు వేసి ఈ రంగుపై నల్లని రంగుతో నంబర్ వేస్తున్నారు.

613 ఫీడర్లలో నంబరింగ్ పూర్తి

టీజీ ఎన్పీడీసీఎల్‌లో మొత్తం 33 కేవీ ఫీడర్లు 716 ఉండగా 613 ఫీడర్లలో నంబరింగ్ పూర్తయింది. ఇందులో 343 ఫీడర్లు డిజిటలైజేషన్ చేశారు. 11 కేవీ ఫీడర్లు మొత్తం 6,651 ఉండగా ఇందులో 3,245 ఫీడర్లు నంబరింగ్ పూర్తయ్యాయి. డిజిటలైజేషన్ 1,849 ఫీడర్లలో చేశారు. అదే విధంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అయిదు సర్కిళ్లలో 33 కేవీ ఫీడర్లు మొత్తం 195 ఉండగా 186 ఫీడర్లలో నంబరింగ్ పూర్తయింది. ఇందులో 49 ఫీడర్లు డిజిటలైజేషన్ చేశారు. అదే విధంగా 11 కేవీ ఫీడర్‌లు మొత్తం 1,727 ఉండగా 1,078 ఫీడర్లలో నంబరింగ్ పూర్తయింది. డిజిటలైజేషన్ 102 ఫీడర్లలో చేశారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 33 కేవీలో నంబర్ కేటాయింపు వివరాలు

సర్కిల్	మొత్తం ఫీడర్లు	పూర్తయిన ఫీడర్లు	డిజిటలైజేషన్
వరంగల్	34	34	22
హనుమకొండ	40	32	10
జనగామ	44	43	--
భూపాలపల్లి	39	39	--
మహబూబాబాద్	38	38	17

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 11 కేవీలో నంబర్ కేటాయింపు వివరాలు

సర్కిల్	మొత్తం ఫీడర్లు	పూర్తయిన ఫీడర్లు	మిగిలిన ఫీడర్లు	డిజిటలైజేషన్
వరంగల్	339	185	154	70
హనుమకొండ	347	320	27	--
జనగామ	375	361	14	--
భూపాలపల్లి	343	143	200	32
మహబూబాబాద్	323	64	254	--



భీమదేవరపల్లిలో 33 కేవీ లైన్‌లో స్తంభానికి వేసిన నంబర్



భీమదేవరపల్లిలో 11 కేవీ లైన్‌లో విద్యుత్ స్తంభానికి వేసిన నంబర్

సమస్య సులువుగా గుర్తించొచ్చు

ఈదురుగాలులు, వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు విద్యుత్ లైన్‌లో సమస్యలు తలెత్తుతాయి. తద్వారా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగి వినియోగదారులు ఇబ్బందులు పడుతారు. ఈ నేపథ్యంలో డిజిటలైజేషన్ ద్వారా సమస్య ఎక్కడ తలెత్తిందో త్వరగా తెలుసుకోవచ్చు. బదిలీలు, నూతన నియామకాల సందర్భంగా కొత్తగా వచ్చే ఉద్యోగులు కూడా నంబరింగ్ ద్వారా సులువుగా తెలుసుకుంటారు. తద్వారా సిబ్బంది వెంటనే చేరుకుని వేగంగా సమస్యను పరిష్కరించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తారు. రైతులు, విద్యుత్ వినియోగదారులు ఏదేనీ సమస్య గుర్తించినప్పుడు విద్యుత్ సిబ్బందికి స్పష్టమైన సమాచారం అందించేందుకు పోల్ నంబరింగ్ దోహదపడుతుంది.

లొకేషన్ త్వరగా గుర్తించొచ్చు



పోల్ నంబరింగ్, డిజిటలైజేషన్ ద్వారా లోకేషన్‌ను త్వరగా గుర్తించొచ్చు. విద్యుత్ లైన్లలో ఏదేని సమస్య ఉత్పన్నమైతే సిబ్బందికి స్పష్టమైన సమాచారం అందించడానికి పోల్ నంబర్ తోడ్పడుతుంది. తద్వారా సిబ్బంది వెంటనే చేరుకుని విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తారు.

- టి.వేణుమాధవ్, ఎస్ఈ, జనగామ

నాణ్యమైన విద్యుత్ అందించేందుకు..



వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం సాంకేతికతకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఈ క్రమంలోనే విద్యుత్ స్తంభాల డిజిటలైజేషన్ ప్రక్రియ చేపట్టాం. వానాకాలంలోపు పోల్ నంబరింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేస్తాం.

- పి.మధుసూదన్ రావు, ఎస్ఈ, హనుమకొండ

కుల, మతాల పేరుతో బీజేపీ చిచ్చు



మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పక్కన ఎంపీ బలరాం నాయక్, ఏఐసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ కొప్పుల రాజు, ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లయ్య నాయక్, తదితరులు

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

హన్మకొండ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుల, మతాల పేరుతో చిచ్చు పెడుతోందని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఆదివాసీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన 'బునియాదీ కార్యకర్త సమ్మేళన్' సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆదివాసీలపై దాడులు పెరిగాయన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్నారన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ పట్టుదలతో ముందుకెళ్తున్నారన్నారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచేది కాంగ్రెస్ పార్టీ అన్నారు. రాష్ట్రంలో పేదల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. మూడు రోజు పాటు శిక్షణలో తెలుసుకున్న అంశాలను క్షేత్ర స్థాయిలో ప్రజలకు చేరవేసి పార్టీని పటిష్ఠం చేయాలన్నారు. ఏఐసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ కొప్పుల రాజు మాట్లాడుతూ బీఆర్ఎస్, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లయ్య నాయక్, ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ నాయకుడు విక్రాంత్ బునియా, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఆదివాసీ కాంగ్రెస్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుగులోత్ రవీందర్ నాయక్ పాల్గొన్నారు.

కమిషనరేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ సందర్శన



ట్రైనింగ్ సెంటర్ నిర్వహణను వివరిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్‌ను రామగుండం ట్రాఫిక్ పోలీసు అధికారులు సోమవారం సందర్శించినట్లు వరంగల్ కమిషనరేట్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో నూతనంగా ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తుండడంతో, ఈ సెంటర్ నిర్వహణపై అధ్యయనం చేసేందుకు అక్కడి సీపీ ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు ట్రైనింగ్ సెంటర్‌ను సందర్శించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించాల్సిన రికార్డులు, డ్రంకన్‌డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహణ తదితర అంశాలను ఏసీపీ సత్యనారాయణ వారికి వివరించారు. కార్యక్రమంలో హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి, ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతుల సహకారంతోనే రజతోత్సవ సభ

- మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

ఎల్కతుర్తి: ఎల్కతుర్తి, చింతలపల్లి గ్రామాల రైతులందరి సహకారంతోనే, వారి అనుమతితోనే బీఆర్ఎస్ రజతోత్సవ సభను నిర్వహిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ స్పష్టం చేశారు. సోమవారం బీఆర్ఎస్ రజతోత్సవ సభా స్థలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు సోమవారం ఈ ప్రాంతానికి వచ్చి కాలువలు పూడుపుతున్నారని, రైతులు ఇబ్బంది పడుతున్నారని చెప్పడంలో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. సభకోసం 1,200 ఎకరాల స్థలంలో రైతులందరి అనుమతి తీసుకొని వారి సమక్షంలోనే పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. సభకు వచ్చే ప్రజలు నడుచుకుంటూ వచ్చేలా కొన్ని ప్రాంతాల్లో మొరం పోశామని, తర్వాత దానిని కూడా తీసేస్తామని చెప్పారు. భూముల హద్దులు చెరిపేశారని అంటున్నారని, ఇందుకు ముందుగానే సర్వేయర్‌తో హద్దులు తీసుకున్నామని తర్వాత వాటిని యథావిధిగా పెడతామని హామీ ఇచ్చారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు పిట్టల మహేందర్, తంగెడ మహేందర్, గోల్లె మహేందర్, తంగెడ నగేష్, ఎల్తూరి స్వామి, మదన్ మోహన్‌రావు, దుగ్యాని సమ్మయ్య, వినయ్‌గౌడ్, చిట్టిగౌడ్, జడ్సన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్, పక్కన ఇతర నేతలు

డీజిల్ లోకోషెడ్ అభివృద్ధికి కృషి చేయాలి

- రైల్వే సీనియర్ డీఎంఈ వెంకటకుమార్

కాజీపేట రూరల్ : కాజీపేట డీజిల్ లోకోషెడ్‌ను అభివృద్ధి చేయడంతోపాటు భారతీయ రైల్వేలో ఈ షెడ్‌కు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి కలిసికట్టుగా కృషి చేయాలని డీజిల్‌షెడ్ సీనియర్ డీఎంఈ ఎన్.వి.వెంకటకుమార్ అన్నారు. కాజీపేట డీజిల్‌లోకోషెడ్‌లో సోమవారం షెడ్ 52వ వసంతాల వేడకలను కేక్‌కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌వైజర్లు, కార్మికుల కృషితో డీజిల్, ఎలక్ట్రిక్ లోకో షెడ్‌లు అభివృద్ధి పథంలో ముందుకెళ్తున్నాయని అభినందించారు. ఇటీవల షెడ్‌లో వరల్డ్ హెరిటేజ్ డే సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలిచిన కార్మికులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక అంశాలు అలరించాయి. కార్యక్రమంలో డీజిల్‌షెడ్ డీఎంఈ అనికేత్ ఖద్గే, ఏడీఎంఈలు భానుప్రకాశ్, నాగరాజశేఖర్, ఏసీఎంటీ రవీంద్రకుమార్, ఎ.ఎం.ఎం రాజేశ్, ఎల్.ఎఫ్ ఎం.రాజశేఖర్, ఈ.ఎఫ్ రమేశ్‌కుమార్, రైల్వే మజ్దూర్ యూనియన్, రైల్వే ఎంప్లాయీస్ సంఘ్, రైల్వే ఓబీసీ, రైల్వే ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్, రైల్వే డీఎంఆర్‌కెఎస్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైల్వే సీనియర్ డీఎంఈ వెంకటకుమార్

రాష్ట్రంలో రైతులు | ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు



సభాస్థలి ఏర్పాట్లు పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పక్కన మాజీ ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, సతీశ్‌కుమార్, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు కిషన్‌రావు, వెంకన్న, వాసుదేవరెడ్డి, సతీశ్‌రెడ్డి

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ఎల్కతుర్తి: తెలంగాణలో కాంగ్రెస్ పాలనలో సాగు, తాగునీటి కష్టాలు మొదలయ్యాని, పంటలు ఎండిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు వచ్చాయని, దీనికి కారణం అసమర్థత పాలనేనని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. సోమవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లి సమీపంలో ఈనెల 27న నిర్వహించబోయే బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాణాలకు తెగించి సాధించుకున్న తెలంగాణకు మళ్లీ అన్యాయం జరుగుతుంటే కేసీఆర్ చూస్తూ ఊరుకోరని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. కరెంట్ రాక.. నీళ్ల లేక పంటలు ఎండిపోయి మళ్లీ రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కోపాన్ని ప్రభుత్వానికి తెలియజేయాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలివచ్చేందుకు ప్రజలు సిద్ధమవుతున్నట్లు వెల్లడించారు. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం బాగుపడుతుందని ప్రజలు భావిస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సభా ప్రాంగణ ఏర్పాట్లును పరిశీలించారు. ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు లింగపల్లి కిషన్‌రావు, నాగుర్ల వెంకన్న, వాసుదేవరెడ్డి, సతీశ్ రెడ్డి, నాయకులు చింతం సదానందం, కడారి రాజు, జి.మహేందర్, ఎల్తూరి స్వామి, టి.మహేందర్, నగేశ్, పి.మహేందర్, సమ్మయ్య పాల్గొన్నారు.

అర్జీలను తక్షణమే పరిష్కరించండి

- అధికారులను ఆదేశించిన అదనపు కలెక్టర్ సంధ్యారాణి
- ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ

వరంగల్: ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి డీఆర్‌ఓ విజయలక్ష్మి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, వరంగల్, నర్సంపేట ఆర్డీఓలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణీతో కలిసి జిల్లావ్యాప్తంగా ప్రజల నుంచి పలు సమస్యలపై మొత్తం 120 దరఖాస్తులు వచ్చాయి. వాటిని సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. నేటి ప్రజావాణిలో అధిక మొత్తంలో రెవెన్యూ శాఖ, కలెక్టరేట్‌కి సంబంధించిన దరఖాస్తులు వచ్చాయి. అందులో రెవెన్యూశాఖకు 45, కలెక్టరేట్ పరిపాలన విభాగానికి 14, హౌజింగ్‌కు 8 రాగా.. మిగతా దరఖాస్తులు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందినవి వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ప్రజావాణి వేళలు మార్పు చేయాలి..

వేసవికాలంతో ఎండలు ముదరడం వల్ల ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం వేళల్లో మార్పు చేయాలని పలువురు కలెక్టర్‌ను విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు మధ్యాహ్నం తిరిగి వెళ్లాలంటే ఎండ తీవ్రతతో వడదెబ్బలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయంటున్నారు. అందువల్ల ఈవేసవికాలం వెళ్లే దాకా ఉదయం 9 నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తే ఎండ తీవ్రతలు పెరగక ముందే ఇంటికి చేరుకునేందుకు బాగుంటుందని పలువురు సూచిస్తున్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి, అధికారులు

నీళ్లు తెమ్మంటే తీసుకురావా రా..

- జూనియర్ పై సీనియర్ విద్యార్థి దాడి
- ఇందిరానగర్ ఎస్సీ హాస్టల్‌లో ఘటన
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

హన్మకొండ చౌరస్తా : 'నీళ్ల తెమ్మంటే తీసుకురావా రా.. నాకే ఎదురు సమాధానం చెబుతావా' అంటూ జూనియర్ పై ఓ సీనియర్ విద్యార్థి దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి హనుమకొండలోని ఇందిరానగర్ ఎస్సీ హాస్టల్‌లో చోటుచేసుకుంది. బాధిత విద్యార్థుల కథనం ప్రకారం.. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన రాజబాబు, పవన్‌కల్యాణ్, రణధీర్, మధుకర్ హనుమకొండ 8వ డివిజన్‌లోని ఇందిరానగర్‌లో గల ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ ప్రభుత్వ కాకతీయ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. సుమారు పదిహేను రోజుల క్రితం ఇదే హాస్టల్‌లో ఉంటూ డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న రంజిత్ వాటర్ బాటిల్‌లోని నీరును రాజబాబు తాగాడు. విషయం తెలుసుకున్న రంజిత్ 'నా వాటర్ బాటిల్‌లోని నీరు తాగి మళ్లీ తీసుకురాకుండా వెళ్తావా' అంటూ గద్దించాడు. దీంతో భయపడిన జూనియర్ విద్యార్థి రాజబాబు అన్న రూమ్‌లో ఉంటే తాగి వెళ్లిపోయానన్న నీ బాటిల్ అని తెలియదని సమాధానం ఇచ్చాడు. నీళ్ల తీసుకురాకుండా నాకే ఎదురు సమాధానం చెబుతావా, నీ సంగతి చెబుతా అంటూ వెళ్లిపోయాడు. అప్పటి నుంచి హాస్టల్‌లో రాజబాబు ఎదురుపడినా ప్రతీసారి దూషణకు దిగేవాడు. రాజబాబు అతడి మిత్రులు అక్కడి నుంచి వెళ్లిపోయినా రెచ్చగొట్టేలా వ్యవహరించేవాడు. ఆదివారం రాత్రి రంజిత్ హాస్టల్‌కు సంబంధం లేని కొందరి వ్యక్తులను తీసుకొచ్చి రాజబాబుపై దాడికి దిగాడు. అడ్డుకున్న అతడి మిత్రులు పవన్‌కల్యాన్, రణధీర్, మధుకర్‌ను సైతం చితకబాదారు. ఈ ఘటనలో రాజబాబుకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత విద్యార్థులు తెలిపారు. ఈ విషయం పై హాస్టల్ వార్డెన్ మోతీలాల్‌ను వివరణ కోరగా గాయపడిన విద్యార్థికి చికిత్స చేయించామని, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు.



దాడిలో గాయపడిన రాజబాబు

సభ పేరుతో పంట పొలాలు ధ్వంసం

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

హసన్‌పర్తి/ఎల్కతుర్తి: బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభపేరుతో పంట పొలాలను ధ్వంస చేస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ధ్వజమెత్తారు. ఎల్కతుర్తిలో జరుగుతున్న రజతోత్సవ సభ పనులను మంగళవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ పేరుతో పంట కాల్వలు, వాగులను పూడ్చివేశారన్నారు. మండలాల సరిహద్దులు తొలగించారన్నారు. అనుమతిలేకుండా చెట్లను నరికివేసినట్లు ఆరోపించారు. ఇప్పటికీ బీఆర్ఎస్ అధికార పార్టీగా వ్యవహరిస్తోందన్నారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పారిశ్రామికవేత్తలను భయభ్రాంతులకు గురిచేస్తూ విరాళాలు వసూలు చేస్తున్నాడని ఆరోపించారు కాగా, రజతోత్సవ సభ పేరుతో బీఆర్ఎస్ నాయకులు మండలాల సరిహద్దులు తొలగించడమే కాకుండా కాల్వలు, వాగులను పూడ్చివేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నాగరాజు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు ఇంద్రాసేనారెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామ్‌నర్సింహారెడ్డి, నాయకులు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, తిరుపతి, వీసం సురేందర్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



పూడ్చివేసిన వాగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

సామాజిక కార్యకర్త కిడ్నాప్.. హత్య!

- పోలీసుల అదుపులో నిందితులు
- నిందితుల్లో కానిస్టేబుల్?



సాయిప్రకాశ్ (ఫైల్)

వరంగల్ క్రైం: ములుగు జిల్లా వెంకటాపూర్ (కె) మండల కేంద్రానికి చెందిన 'చేయూత'స్వచ్ఛంద సంస్థ కార్యకర్త చేడం సాయి ప్రకాశ్(30)ను కిడ్నాప్ చేసి హత్యకు పాల్పడినట్లు తెలిసింది. పోలీసులు, అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. సాయి ప్రకాశ్ ఈనెల 15న వెంకటాపూర్ నుంచి హనుమకొండకు తన బంధువులను ఆస్పత్రికి తీసుకొచ్చాడు. ఆ తర్వాత తన ఆచూకీ తెలియకపోవడంతో ఈనెల 16, 17 తేదీల్లో వెతికిన అనంతరం 18న బంధువులు హనుమకొండ పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు దర్యాప్తులో భాగంగా సాయిప్రకాశ్ హనుమకొండకు వచ్చిన ఆస్పత్రి, ఆ తరువాత వెళ్లిన దృశ్యాలను సీసీ టీవీ పుటేజీల ద్వారా పరిశీలించారు. తన ఫోన్ ద్వారా ఆచూకీ కనిపెట్టే ప్రయత్నం చేశారు. అయినప్పటికి వివరాలు రాకపోవడంతో ఏసీపీ కొత్త దేవేందర్‌రెడ్డి రెండు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. అప్పటికే సాయి ప్రకాశ్‌ను కిడ్నాప్ చేసిన దుండగులు కరీంనగర్‌లో హత్య చేసినట్లు తెలిసింది. దీంతో సాయి ప్రకాశ్‌కు ఎవరితో శతృత్వం ఉందనే కోణంలో విచారణ చేపట్టడంతో నిందితుల సమాచారం తెలిసినట్లు తెలిసింది.

నిందితుల్లో కానిస్టేబుల్?

సాయి ప్రకాశ్ హత్య సంఘటనలో పాల్గొన్న నిందితుల్లో ఓ కానిస్టేబుల్ ఉన్నట్లు సమాచారం. పోలీసులు ఇప్పటికే ఆరుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు సమాచారం. హనుమకొండలో సాయి ప్రకాశ్‌ను కిడ్నాప్ చేసి కరీంనగర్‌లో హత్య చేసినట్లు గుర్తించారు. ఈ హత్యకు గతంలో వెంకటాపూర్ పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన ఓ కానిస్టేబుల్ ప్రధాన కారణమని తెలిసింది. సాయి ప్రకాశ్ బంధువుల్లో ఓ మహిళతో కానిస్టేబల్ వివాహేతర సంబంధం విషయంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఆ కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు పడినట్లు తెలిసింది. దానిని మనస్సులో పెట్టుకుని సాయి ప్రకాశ్‌ను కిడ్నాప్ చేసి హత్య చేసినట్లు తెలిసింది. పోలీసుల విచారణలో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.